**పంటరుణాల మాఫీపై** సర్కారు పెట్టిన ఆంక్షలు రైతాంగాన్ని కలవరపాటుకు గురిచేస్తున్నాయి. రేషన్‌కార్డుతో పాటు 'పీఎం కిసాన్' నిబంధనలను ప్రామాణికంగా తీసుకోవడం వంటివి అన్నదాతల్లో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. ఎన్నికలకు ముందు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని దేవుడి మీద ఒట్టేసి మరీ చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఇలా కొర్రీలు విధించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీపై సర్కారు తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా నిబంధనల ప్రకారం చూస్తే ఉమ్మడి జిల్లాలో చాలా మందికి రుణమాఫీ వర్తించకపోయే ప్రమాదముంది. కిసాన్ సమ్మాన్ యోజన, రేషన్ కార్డు నిబంధన అంటూ విధివిధానాలను ప్రకటించడంపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

–నిజామాబాద్, జూలై 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- రుణమాఫీపై రేవంత్ సర్కారు ఆంక్షలు
- రేషన్‌కార్డు, పీఎం కిసాన్ నిబంధనల వర్తింపు
- ఉమ్మడి జిల్లాలో మాఫీ అయ్యేది ఎందరికో?
- ఎన్నికలప్పుడు ఒకమాట.. ఇప్పుడు మరోమాట
- కాంగ్రెస్ సర్కారుపై రైతన్నల ఆగ్రహం



రాజధాని హైదరాబాద్‌లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్



# మాఫీ అయితదా?



## ఆందోళనలో రైతాంగం



**బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో** రైతులను కాంగ్రెస్ పార్టీ రెచ్చగొట్టింది. 2018లో రెండోసారి కేసీఆర్ సర్కారు కొలువుదీరిన తర్వాత అసాధారణమైన పరిస్థితులు ఎదురయ్యాయి. ప్రధానంగా కరోనా ముప్పును ప్రపంచమంతటా ఎదుర్కొంది. దీంతో రుణమాఫీ అమలులో జాప్యం జరిగింది. బాధ్యతగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్ పార్టీ అవేవీ పట్టించుకోకుండా రైతులను తప్పుదోవ పట్టించింది. కేసీఆర్ సర్కారు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసినప్పటికీ కాంగ్రెస్ దుష్ప్రచారానికి ఒడిగట్టింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో దాదాపుగా 5లక్షల మంది రైతులకు పంట రుణాలను మాఫీ చేసి చూపించింది. రైతులంతా కేసీఆర్‌కు జై కొడతారని గ్రహించి రంగంలోకి దిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముంగిట రూ.2లక్షల రుణమాఫీని ఎత్తుకున్నది. రుణమాఫీ పొందిన వారు తిరిగి రుణాలను తెచ్చుకోవాలంటూ రెచ్చగొట్టారు. రేవంత్ మాటలను నమ్మి రుణాలు తెచ్చుకున్న వారిపై ఇప్పుడు వడ్డీల భారం పడుతున్నది. అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయ రుణాలు రద్దు చేస్తామని చెప్పి ఏడు నెలలుగా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తీరా ఆగస్టు 15లోపు రైతు రుణాలు రద్దు చేస్తామని హామీ ఇవ్వగా నిబంధనల కొర్రీలతో సగానికి ఎక్కువ మందికి మాఫీ దక్కకుండా చేస్తున్నట్లుగా అర్థమవుతున్నది. చాలా మంది సన్న, చిన్నకారు రైతులే ఉన్నప్పటికీ సాంకేతికంగా రేషన్‌కార్డు లేని వారు, కిసాన్ సమ్మాన్ యోజన పరిధిలోకి రాని వారు కూడా ఉన్నారు. ఈ రెండింటినీ ప్రామాణికంగా తీసుకుంటే చాలా మందికి రుణమాఫీ రాకపోవచ్చన్న భయం ఇప్పుడు అందరిలోనూ పట్టుకున్నది. బేషరతుగా రూ.2లక్షల్లోపు రైతురుణాలను మాఫీ చేయాలని, నమ్మించి మోసం చేయడం తగదంటూ ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

### అడియాశలవుతున్న హామీలు..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన వాగ్దానాలను రైతులు నమ్మారు. రైతు సర్కారుగా ముద్రపడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కాదని హస్తం పార్టీకి ఓట్లు వేశారు. నమ్మశక్యం కాని హామీలకు ఆసక్తి చూపిన రైతులంతా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతు డిక్లరేషన్ ప్రకారం ప్రభుత్వం అందించే వరాల మూటపై ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇందులో ప్రధానంగా పెట్టుబడి సాయంగా ఎకరానికి ఏటా రూ.15వేలు, రూ.2లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు ప్రోత్సాహకాలు, వరి ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ వంటి హామీలున్నాయి. గద్దెనెక్కి ఏడు నెలలు పూర్తి చేసుకున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ఇప్పటి వరకు రెండు సీజన్‌లు ముగిసినప్పటికీ రైతుబంధు బదులుగా కాంగ్రెస్ ఇవ్వజూపిన రైతుభరోసా ఎక్కడా అమలు కాలేదు. గత యాసంగిలో అరకొరగా రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని కేవలం 5ఎకరాల్లోపు రైతులకు అందించారు. ఈ వానకాలం సాగు మొదలై రెండు నెలలు కావొస్తున్నప్పటికీ ఇంత వరకూ అతీగతీ లేదు. రైతుభరోసాకు మార్గదర్శకాల పేరిట ఊరూరా తిరుగుతూ రైతులతో ముఖాముఖి పేరిట మంత్రుల కమిటీ తాత్సారం చేస్తున్నది. పంటకాలం గడుస్తున్నప్పటికీ రైతులకు చిల్లిగవ్వ సాయం అందించకుండా కాంగ్రెస్ పార్టీ చోద్యం చూస్తున్నది. ఈ పరిస్థితిపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. కేసీఆర్ హయాంలో సీజన్ మొదలవ్వడానికి ముందే బ్యాంక్ అకౌంట్లో రూ.5వేలు జమ అయ్యేవని చెబుతున్నారు. రేవంత్ రెడ్డి సర్కారు వచ్చాక రైతుభరోసా పేరిట ఇస్తామన్న పెట్టుబడిసాయం పత్తాలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక యాసంగిలో వరి ధాన్యానికి ఇవ్వాల్సిన బోనస్ రూ.500లకు కాంగ్రెస్ మంగళం పాడింది. వానకాలంలో సన్నవడ్లకు మాత్రమే ఇస్తామంటూ దాటవేసి ఒక సీజన్‌ను తప్పించుకున్నది. ఈ సీజన్‌లో వచ్చే సన్నవడ్లకైనా బోనస్ వర్తిస్తుందా? లేదంటే నిబంధనల పేరిట కొర్రీలు పెడతారా? అంటూ రైతులు గుసగుసలాడుతున్నారు.

### మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా నెరవేర్చాలి..



ఇందల్వాయి, జూలై 16: ప్రభుత్వం ఏర్పడక ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటకు కట్టుబడాలి. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆంక్షలు విధించడం సరికాదు. మరోసారి ఆలోచించి రైతులకు తగిన న్యాయం చేయాలి.

**- నీరడి పద్మారావు, రైతు, బర్ధిపూర్, డిచ్‌పల్లి మండలం**

### రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి



రాష్ట్ర ప్రభుత్వం ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాఫీని ఎలాంటి ఆంక్షలు లేకుండా వర్తింపజేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం రుణమాఫీ చేయకుంటే రైతులు ఆందోళనకు దిగే పరిస్థితి ఉంటుంది. కొత్త విధానాలతో రైతులకు నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తే సహించబోం.

**- చిలువేరి గంగాదాస్, రైతు**

### కౌలు రైతులకూ రుణమాఫీ వర్తింపజేయాలి



ప్రభుత్వం ఏర్పడక ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంతోపాటు రుణమాఫీ పథకాన్ని కౌలు రైతులకు సైతం వర్తింపజేయాలి. అప్పుడే ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరినట్లవుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రైతులకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయి. రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా నిర్ణయం తీసుకోవాలి. కౌలు రైతులు రాష్ట్రంలోఎందరో ఉన్నారు. వారిని కాపాడుతారనే ఉద్దేశంతో ప్రభుత్వానికి ఓటేశారు. హామీలను విస్మరిస్తే రాష్ట్ర ప్రజలు తిరగబడుతారు.

**- పాశంకుమార్, ఇందల్వాయి**

## 'పిన్నియే మా చావుకు కారణం'

- ఆత్మహత్యకు ముందు శైలజ వెల్లడి
- భర్తతో కలిసి తీసుకున్న సెల్ఫీ వీడియో వైరల్
- యువ జంట మృతితో హెగ్డోలిలో విషాదఛాయలు



ఆత్మహత్య చేసుకున్న బండారి అనిల్, శైలజ (ఫైల్)

బోధన్, జూలై 16: తాము చనిపోవడానికి పిన్ని లక్ష్మియే కారణమని.. పోతంగల్ మండలం హెగ్డోలికి చెందిన శైలజ ఆత్మహత్యకు ముందు వెల్లడించింది. తన భర్త అనిల్‌తో కలిసి ఆమె సోమవారం రాత్రి నవీపేట్ మండలం మిట్టాపూర్ రైల్వే గేటు సమీపంలో రైలు కిందపడి చనిపోయిన సంగతి తెలిసిందే. ఆత్మహత్యకు ముందు భర్తతో కలిసి శైలజ తీసుకున్న సెల్ఫీ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. పోతంగల్ మండలం హెగ్డోలా గ్రామానికి చెందిన అనిల్‌కు, పాత పోతంగల్‌కు చెందిన శైలజతో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. అయితే, అప్పట్లో జరిగిన ఓ పొరపాటును శైలజ వాళ్ల పిన్ని ప్రచారం చేస్తుండడాన్ని తట్టుకోలేక యువ జంట ఆత్మహత్య చేసుకుంది.

'మేము చనిపోవటానికి కారణం పిన్ని.. సంవత్సరం కిందట నేను ఒక తప్పుచేశాను.. దాని గురించి మా పిన్ని ప్రచారం చేస్తున్నది. అది తట్టుకోలేక చచ్చిపోవాలని మేము నిర్ణయించుకున్నామని ' శైలజ సెల్ఫీ వీడియోలో పేర్కొంది. తాను చేసిన తప్పు తన భర్త, అత్త, మామలకు తెలుసని, వారు తనను ఏమీ అనలేదని తెలిపింది. అయితే, మా పిన్ని మాత్రం కొంతమందికి ఆ విషయం చెప్పిందని, తాము ఎవరికీ చెప్పవద్దని కోరినా ఇటీవల మరికొంతమందికి చెబుతూ ప్రచారం చేసిందన్నారు. ఈ విషయం తెలిసిన తన భర్త ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడని పేర్కొంది. అయినప్పటికీ, మా పిన్ని ఇతరులకు నా విషయం చెప్పటంతో మేము తట్టుకోలేక చనిపోవాలని నిర్ణయించుకున్నామని తెలిపింది. తమ చావు విషయంలో అత్త, మామలను ఏమీ అనవద్దని, నా అన్నకు కూడా వారిని అడిగే రైట్స్ లేవని సెల్ఫీ వీడియోలో స్పష్టం చేసింది.

ఆత్మహత్యకు ముందు తీసుకున్న ఈ వీడియోను అనిల్ దంపతులు కోటగిరి ఎస్సైకి సోమవారం రాత్రి పంపించారు. దీంతో ఆయన వెంటనే నవీపేట్, ఎడపల్లి ఎస్సైలను అప్రమత్తం చేసి గాలింపు చేపట్టారు. నవీపేట్ పోలీసులు బాసర గోదావరి వద్ద గాలించారు. అయితే, దంపతులు వాడిన ఫోన్లను ట్రేస్ చేయడం ద్వారా నవీపేట్ మండలం మిట్టాపూర్ రైల్వే గేట సమీపంలో ఉన్నట్లు గుర్తించి అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అనిల్, శైలజ రైలు పట్టాలపై విగతజీవులుగా కనిపించారు. యువ దంపతుల మృతితో పోతంగల్, హెగ్డోలి గ్రామాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు మృతదేహాలను నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం హెగ్డోలిలో అంత్యక్రియలు నిర్వహించారు.

### లక్ష్మిపై కేసు నమోదు

నవీపేట, జూలై 16: అనిల్ దంపతులు ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితురాలు లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయరెడ్డి తెలిపారు. ఆత్మహత్యకు ముందు శైలజ తీసుకున్న సెల్ఫీ వీడియోలో తమ మరణానికి కారణం పిన్ని లక్ష్మియే కారణమని చెప్పిందన్నారు. దీంతో ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



ఏనుగు రవీందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న అనుచరులు

## మాపై పెత్తనం చేస్తే ఊరుకోం..

బాన్సువాడ, జూలై 16: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బాన్సువాడ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ తీసుకొచ్చిన మాపై ఎవరో పెత్తనం చెలాయించాలని చూస్తే ఊరుకునేది లేదని ఏనుగు రవీందర్‌రెడ్డి అనుచరులు హెచ్చరించారు. బాన్సువాడలోని రవీందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడ ప్రాంత ప్రజలకు న్యాయం జరగాలి. అంతే కానీ లోకల్, నాన్ లోకల్‌కు సంబంధం ఏముందని ప్రశ్నించారు. కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం పేరుతో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేయకుండా, కేవలం రవీందర్‌రెడ్డిని ఎలా బయటకు పంపించాలన్న రీతిలో సమావేశం నిర్వహించారని మండిపడ్డారు. అసలైన కాంగ్రెస్ కార్యకర్తలం తామేనని, తమపై పెత్తనం చెలాయించాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

## 'విమర్శలు చేస్తే తరిమికొడతాం'

బాన్సువాడ, జూలై 16: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజును విమర్శిస్తే ఊరుకునేది లేదని వారి అనుచరులు హెచ్చరించారు. బాన్సువాడలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 15 ఏండ్లుగా కాంగ్రెస్ జెండా మోస్తున్న కాసుల బాల్‌రాజ్‌కు కాకుం డా అధిష్టానం ఏనుగు రవీందర్‌రెడ్డికి టికెట్ ఇస్తే తామంతా కష్టపడి పని చేశామన్నారు. కానీ బాల్‌రాజ్‌కు పదవి వ స్తుంటే అడ్డుకోవాలని చూసింది మీరు కాదా? అని ఏనుగు అనుచరులను ప్రశ్నించారు. రవీందర్‌రెడ్డి ఇప్పటిదాకా పోచారం, కాసులకు వ్యతిరేకంగా మాట్లాడలేదని, మీరెందుకు మాట్లాడుతున్నారన్నారు. నేతలకు వ్యతిరేకంగా మాట్లాడున్న వారికి పార్టీ కార్యకర్తలే తరిమి కొడతారని యూత్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు దేవికృష్ణ ప్రసాద్, రత్నాకర్ హెచ్చరించారు.



బాన్సువాడలో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు



పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ శాసనసభ్యులు మంగళవారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సహా కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు.

## నాడు కాళేశ్వర జలాలతో కళకళ.. నేడు ఇసుక దిబ్బలతో వెలవెల

*కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం జలాలతో నిరుడు నిండుకుండలా కనిపించిన చెక్‌డ్యాంలు.. నేడు నీళ్లు లేక ఇసుక దిబ్బలతో వెలవెలబోయి కనిపిస్తున్నాయి. గతేడాది ఇదే సమయంలో ఇప్పట్లాగే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం జలాలను ఎదురెక్కించి వాగులకు, చెరువులకు జలకళ తీసుకొచ్చింది. 21 ప్యాకేజీ ద్వారా నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ శివారులోని కప్పలవాగుకు గోదావరిని తరలించింది. వానల కోసం ఆకాశం వైపు ముఖం పెట్టిన రైతాంగం.. తరలివచ్చిన గంగమ్మను చూసి పులకరించింది. ఏడాది క్రితం నాటి వర్షాభావ పరిస్థితులే ఇప్పుడు నెలకొన్న తరుణంలో కప్పలవాగు కళ తప్పింది. రైతాంగం ఆకాశంతోపాటు ప్రభుత్వం వైపు ఆశగా చూస్తున్నది. కానీ వారిని పట్టించుకునే వారేరి? కాళేశ్వరం జలాలను తెప్పించే వారేరి?*

*– భీమ్‌గల్, జూలై 17*

నాడు

కప్పలవాగు చెక్‌డ్యాం పైనుంచి జాలువారుతున్న కాళేశ్వరం జలాలు



నేడు



నీళ్లు లేక వెలవెలబోతున్న కప్పలవాగు చెక్‌డ్యాం






